## నాల్గవ ప్రకరణం

# ఇబాదత్ అంటే ఏమిటి?

**(1) ఇబాదత్ అర్థం :** అశక్తత, అణకువ, వినయం, వినమ్రత, దీనావస్థలకు మరోపేరే ఆరాధన (ఇబాదత్).

**షరీయత్‌పరంగా :** షరీయత్‌లో దీనికి పలు నిర్వచనాలున్నప్పటికీ వాటన్నింటి భావార్థం మటుకు ఒకటే.

**ఒక నిర్వచనం :** అల్లాహ్ తన ప్రవక్తల ద్వారా పంపిన ఆజ్ఞను శిరసావహిస్తూ ఆయనకు విధేయత చూపటమే ఇబాదత్ (ఆరాధన, దాస్యం).

**మరో నిర్వచనం :** ఇబాదత్ (దాస్యం, ఆరాధన) అంటే అర్థం పరమపవిత్రుడైన అల్లాహ్ ముందు అణకువను, వినయ వినమ్రతలను వ్యక్తం చేయటం. అంటే అల్లాహ్ యెడల భక్తితో, ప్రేమాతిశయంతో తన నిస్సహాయ స్థితిని చాటి చెప్పటం.

**ఇబాదత్ సమగ్ర నిర్వచనం ఇది :** మనో వాక్కాయ కర్మల చేత మనిషి అల్లాహ్‌కు నచ్చిన, అల్లాహ్‌కు మెచ్చిన వాటిని చేయటమే ఇబాదత్ అనబడుతుంది.

ఈ ఆరాధనలు మనసుతోనూ, మాటలతోనూ, కర్మలతోనూ ముడిపడి ఉన్నాయి. వీటిలో భయము, ఆశ, ప్రేమ, నమ్మకం, అనుబంధం వంటివన్నీ మనసుతో సంబంధమున్న ఆరాధనలనబడతాయి. దైవస్తోత్రం, దేవుని పవిత్రతను కొనియాడటం, దేవుని గొప్పదనాన్ని చాటి చెప్పటం కృతజ్ఞతలు తెలుపటం – వీటన్నింటి సంబంధం మనసుతో, నోటితో ఉంటుంది.

నమాజ్ చేయటం, జకాత్ చెల్లించటం, హజ్జ్ చేయటం, జిహాద్ చేయటం వంటి ఆరాధనలన్నీ శారీరకమైనవి. అయితే వీటన్నింటి వెనుక కూడా అంతర్ప్రేరణ ఉంటుంది.

ఇవి గాకుండా ఆరాధనలో మరెన్నో రకాలున్నాయి. వాటన్నింటి సంబంధం మనసుతో, నోటితో, శరీరంతో ఉంటుంది.

దేవుడు ప్రాణులను సృష్టించటంలోని అసలు ఉద్దేశ్యం ఆరాధనే.

﴿وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ ☆ مَا أُرِيدُ مِنْهُم مِّن رِّزْقٍ وَمَا أُرِيدُ أَن يُطْعِمُونِ ☆ إِنَّ اللَّهَ هُوَ الرَّزَّاقُ ذُو الْقُوَّةِ الْمَتِينُ﴾ (الذاريات:٥٦،٥٨)

**“నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది వారు నన్ను ఆరాధించటానికి మాత్రమే. నేను వారి నుండి జీవనోపాధిని కోరటం లేదు. వారు నాకు అన్నం పెట్టాలని కూడా నేను కోరటం లేదు. అల్లాహ్ స్వయంగా అందరికీ ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహాశక్తిశాలి, మహాబలుడు.” (అజ్ జారియాత్ : 56 – 58)**

మానవుల, జిన్నాతుల పుట్టుకలోని పరమార్థం దైవారాధన, దైవదాస్యమేనని పై

https://teluguislam.net

సూక్తుల ద్వారా విదితమవుతోంది. అల్లాహ్ అక్కరలేనివాడు. వారు ఆయన్ని ఆరాధించకపోయనంత మాత్రాన ఆయనకు కలిగే నష్టం ఏమీ లేదు. యదార్థానికి అది వారి అవసరం. ఎందుకంటే వారు అనుక్షణం అల్లాహ్‌పై ఆధారపడి ఉన్నారు. కనుక వారు ఆయన్ని, ఆయన చూపిన పద్ధతి (షరీయత్) ప్రకారం ఆరాధించాలి. దైవారాధనకు నిరాకరించినవాడు 'గర్విష్టి' అనబడతాడు. దైవారాధనలో ఇతరులకు భాగస్వామ్యం కల్పించినవాడు 'ముష్రిక్' (షిర్క్ చేసినవాడు) అవుతాడు. దేవుడు పంపిన షరీఅత్‌కు విరుద్ధంగా దైవారాధన చేసినవాడు 'బిద్అతీ' గా పరిగణించబడతాడు. కాగా; ఒక్కడైన అల్లాహ్‌ను ఆయన పంపిన షరీయత్ ప్రకారం ఆరాధించినవాడు విశ్వాసి (మోమిన్)గా, ఏకేశ్వరోపాసి (మువహ్హిద్) గా భావించబడతాడు.

## (2) ఇబాదత్ (ఆరాధన) పలు రకాలు. అందులో చేరి ఉన్న అంశాలు:

ఆరాధన అనేది అనేక రకాలు. మనిషి నోటిద్వారా, శరీరావయవాల ద్వారా వ్యక్తమయ్యే, మనసు ద్వారా ప్రేరితమయ్యే ఎన్నో వినయ విధేయతలను, క్రియలను అది తనలో అంతర్లీనం చేసుకుని ఉంది. ఉదాహరణకు : దైవకీర్తన, దేవుని పవిత్రతను కొనియాడటం, ఖుర్ఆన్ పారాయణం, ఖుర్ఆన్ అనుసరణ, నమాజ్, ఉపవాసం, జకాత్, హజ్జ్, జిహాద్, మంచిని పెంపొందించటం, చెడుల నుండి ఆపటం, బంధువుల, అనాథల, బాటసారుల హక్కును నెరవేర్చటం, అల్లాహ్ పట్ల, ఆయన ప్రవక్త పట్ల ప్రేమ కలిగి ఉండటం, దైవభీతి, దేవుని వైపునకు పశ్చాత్తాపభావంతో మరలటం, ధర్మాన్ని కేవలం అల్లాహ్ కొరకు ప్రత్యేకించటం, దైవనిర్ణయాలపై ఓర్పు వహించటం, దేవుని విధి వ్రాతపై సంతృప్తిచెందటం, అల్లాహ్‌పైనే భారం మోపటం, ఆయన కారుణ్యాన్ని ఆశించటం, ఆయన శిక్షకు భయపడటం – ఇవన్నీ ఆరాధనలో అంతర్భాగమే. అంతేకాదు, ఒక విశ్వాసి చేసే ప్రతి పనీ – దాని వెనుక సత్సంకల్పం గనక ఉంటే – అది ఆరాధనా పరిధిలోనికే వస్తుంది. ఆఖరికి అతని దైనందిన అలవాట్లు సయితం ఆరాధనలోనికే వస్తాయి. కాకపోతే ఆ అలవాట్లలో అతను దైవ విధేయతకు కట్టుబడి ఉండాలి. దైవప్రసన్నతను చూరగొనటమే అతని నిజ ధ్యేయమై ఉండాలి. ఉదాహరణకు : తినటం, త్రాగటం, నిద్రించటం, క్రయవిక్రయాలు జరపటం, జీవనోపాధిని అన్వేషించటం, వివాహమాడటం – ఇవన్నీ సంకల్పశుద్ధి మూలంగా ఆరాధనలుగా మారిపోతాయి. వీటికి గాను పుణ్యఫలం ప్రాప్తిస్తుంది. ఇబాదత్ (ఆరాధన) అనేది కేవలం కొన్ని ప్రసిద్ధిచెందిన క్రియలకు, చిహ్నాలకు మాత్రమే ప్రతీక కాదు.

https://teluguislam.net